ఇది ప్రజా సమస్యల... పరిష్కార సారథి

# ప్రభాత జాగృతి

ప్రజా చైతన్య.. రథ సారథి

www.prabhathajagruthi.com

సంపుటి : 00
సంచిక : 134
24.1. 2026
శనివారం


24 Karat ₹ 1,55,150
per kg ₹ 2,37,100



# మేడారంలో జనజాతర

## భారీగా తరలి వస్తోన్న జనం

- ప్రత్యేక రైళ్ళను నడపనున్న దక్షిణమధ్య రైల్వే
- మేడారంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట
- సురక్షిత తాగునీటి సౌకర్యం ఏర్పాటు
- దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు

**వరంగల్, జనవరి 23 (ప్రభాత జాగృతి) :**

సమ్మకక్క సారలమ్మ జాతరకు మేడారం జనసంద్రంగా మారుతోంది. జాతర ప్రారంభానికి ముందు జనం తండోపతండాలుగా వస్తున్నారు. వాహనాల రద్దీ పెరిగింది. ఇప్పటికే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పుడు దక్షిణమధ్య రైల్వే కూడా వివిధ ప్రాంతాల నుంచి వరంగల్, కాజీపేటల వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే మేడారం జాతర ప్రత్యేక రైళ్లను ఈ నెల 28 నుంచి నడపనుంది. రాష్ట్రంలోని సికింద్రాబాద్, మంచిర్యాల్, సిరిపూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాద్, నిజామా బాద్, ఖమ్మం ప్రాంతాల నుంచి మేడారం జాతర ప్రత్యేక రైళు వరంగల్, కాజీపేటల వరకు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నడిచే మేడారం జాతర ప్రత్యేక రైళ్లు పూర్తిగా అన్ రిజర్వుడ్ జనసాధారణ రైళ్లని జాతర వెళ్లే భక్తులు ఈ రైళ్లను వినియోగించుకోవాలని కోరారు. ఇవి ఆయా మార్గాల్లోని అన్ని స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఈనెల 28, 30, ఫిబ్రవరి 1 తేదీల్లో సికింద్రాబాద్ -మంచిర్యాల్- సికింద్రా బాద్ ప్రత్యేక రైళ్లు కాజీపేట మీదుగా కాజీపేట మీదుగా నడుస్తాయి. సికింద్రాబాద్- మంచిర్యాల్ రైలు(07495) ఉదయం 5.45 గంటలకు సికిందరాబాద్‌లో బయలుదేరి ఉదయం 8.45 గంటలకు కాజీపేటకు, మధ్యాహ్నం 1.30 గంటలకు మంచిర్యాల్ చేరుకుంటుంది. తిరిగి అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు మంచిర్యాల్-సికిందరాబాద్ రైలు (07496) మంచి ర్యాల్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు కాజిపేటకు, రాత్రి 10.10 గంటలకు సికిందరా బాద్ చేరుకుంటుంది. నెల 29, 31 తేదీల్లో సికింద్రారాబాద్-సిరిపూర్ కాగజ్ నగర్-సికింద్రాబాద్ మేడారం (07497/07498) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి, ఈ తేదీలలో మేడారం జాతర ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్ నుంచి ఉదయం ఉదయం 5.45 గంటలకు బయలుదేరి ఉదయం 8.45 గంటలకు కాజీపేటకు, మధ్యాహ్నం 2 గంటలకు సిరిపూర్ కాగజ్‌నగర్ చేరుకుంటాయి. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు సిరిపూర్ కాగజ్‌నగర్‌లో బయలుదేరి రాత్రి 7.45 గంటలకు కాజిపేటకు, రాత్రి 10.10 గంటలకు

# సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చా

- లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- లీకులను ఎవ్వరూ నమ్మకండన్న కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత జాగృతి) :**

లీకులను ఎవరూ నమ్మొద్దు.. ఇది లీకు వీరుల ప్రభుత్వమని కెటిఆర్ ఎద్దేవా చేశారు. లీకులపై ఆధారపడి ప్రభుత్వం నడిపిస్తున్నారని సెటైర్లు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును సిట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. ఈ కేసులో కేటీఆర్‌ను అధికారులు పలు ప్రశ్నలు అడిగారు. కేటీఆర్‌ను సుమారుగా 7 గంటలకు పైగా ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న తర్వాత మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. లీకులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. కొంతమంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి.. బెదిరించామని బయట ప్రచారం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది వాస్తవమా? కాదా? అని సిట్‌ను తాను అడిగానని తెలిపారు. ఆ వార్తలు అవాస్తవమని అధికారులు చెప్పారని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై చర్యలేవీ అని తాను ప్రశ్నించానని అన్నారు. ఇప్పుడు తమ ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని అధికారులను నిలదీశానని తెలిపారు. తన ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారని విమర్శించారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో వేధించడం తప్ప.. వీళ్లు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారని ఆరోపణలు చేశారు. పారిశ్రామికవేత్తకు గన్ పెడితే సిట్ ఎందుకు వేయరు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రుల, సన్నిహితుల దోపిడీపై సిట్ వేయరా,,? అని నిలదీశారు. న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని చెప్పుకొచ్చారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తనను ఎవరితోనూ కలిపి అధికారులు విచారించలేదని చెప్పుకొచ్చారు. ఈ విచారణలో తాను తప్ప మరే రావు లేరని తెలిపారు. తనను విచారణకు మళ్లీ పిలుస్తామని అధికారులు అన్నారని... బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.



## బిఆర్ఎస్ నేతలతో కెటిఆర్, హరీష్ రావుల భేటీ

- సిట్ విచారణపై పార్టీ నేతలతో సమాలోచనలు
- ఓటుకు నోటు దొంగ సిఎం కావడంతోనే వేధింపులు: కెటిఆర్

## చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

ఆధారాలు, రికార్డుల ఆధారంగా కెటిఆర్ విచారణ : సిట్ చీఫ్ సజ్జనార్

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

- సృజన్ బాగోతంతో సిట్ నోటీసులు
- రెండేళ్లయినా లీకుల వ్యావహారమేనా
- కోల్ స్కామ్‌తో కాంగ్రెస్ పతనం ఖాయం
- మీడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత జాగృతి) :**




సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం బయటపెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. ధైర్యం ఉంటే సిట్ విచారణ వీడియో బయటపెట్టాలని సవాల్ విసిరారు. లీకులతో ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిట్.. పొట్టు.. లట్టుకి భయపడేది లేదని ఎద్దేవా చేశారు.



## టీవీ సీరియల్‌లా సాగుతున్న

# సిట్ విచారణ

## ఫోన్ ట్యాపింగ్ దొంగలను పట్టుకోని ప్రభుత్వం

- కెసిఆర్ కుటుంబం ఎందరి జీవితాలనో నాశనం చేసింది
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణలు

**హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత జాగృతి) :**

తెలంగాణ ప్రజల భద్రతతో పోలీసు అధికారులు ఆడుకుంటున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తమ పోస్టింగ్‌ల కోసం పోలీసులు వికృత క్రీడలో భాగస్వాములయ్యారని తెలిపారు. హరీశ్‌రావు, కేటీఆర్‌కు సంబంధం లేని శాఖల గురించి పోలీసులు విచారణకు పిలిచారని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడుతూ.. ట్యాపింగ్‌కు సిట్ వేయడమే చట్ట వ్యతిరేకమని అన్నారు. కానీ 380 సాక్షులను విచారించారని మండిపడ్డారు. కానిస్టేబుళ్లు, హోంగార్డులను బలవంతంగా విచారించినట్లు తెలిసిందని అన్నారు. వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ వేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌కు పోలీసులకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఆ విషయం డీజీపీ, సీపీ సజ్జనార్‌కు కూడా తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రక్రియ గోప్యంగా జరుగుతుందని తెలిపారు. హోంమంత్రి, సీనియర్ ఐపీఎస్‌లకు కూడా ఎస్ఐబీ ఎక్కడ ఉంటుందో తెలియదని అన్నారు. ఫలానా

## ఫోన్ ట్యాపింగ్ సర్వసాధారణం

- అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తాయి
- బిఆర్ఎస్ నేతలను టార్గెట్ చేయడం దారుణం
- సిట్ విచారణాధికారం సజ్జన్నార్‌కు లేదు
- బిఆర్ఎస్ నేత, మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్



# వ్యవసాయం ఓ విజ్ఞానం

- జై కిసాన్‌కు తోడు..జై విజ్ఞాన్..జై అనుసంధాన్
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- సూర్యాపేటలో పలు కర్యాక్రమాలకు హాజరు

**సూర్యాపేట,జనవరి 23 (ప్రభాత జాగృతి) :**




'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్దిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో

# ప్రయాణం కన్నా.. ప్రాణం ముఖ్యం

- కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి
- జాగ్రత్తగా వాహనాలు నడపాలి
- సైబరాబాద్ సిపి ఆధ్వర్యంలో హెల్మెట్లు పంపిణీ


2

# జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- గెజిట్ విడుదల చేసిన సర్కార్


2

# మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

- రూ.3 కోట్ల 70 లక్షల నిధుల విడుదల
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు

ఎట్టకేలకు మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయాన్ని అందించింది. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను విడుదల చేసింది.


2

# అమెరికా మరో సంచలన నిర్ణయం

## డబ్ల్యూహెచ్‌వోనుంచి వైదులుగుతున్నట్లు ప్రకటన

అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అనేక విషయాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వోనుంచి అధికారికంగా వైదొలిగింది.రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం.


2

## మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

**న్యూఢిల్లీ, జనవరి 23**(ప్రభాత జాగృతి) : కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిధులు మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'గిరిజన సర్క్యూట్' పథకం కింద ఇప్పటికే మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో సుమారు రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు కల్పించారు. రోడ్లు, వసతి సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు, ఇతర సదుపాయాలు కల్పించడంతో ఈ ప్రాంతాలకు పర్యాటక ఆకర్షణ మరింత పెరిగింది. సమ్మక్క – సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. రామప్ప ఆలయం, మేడారం జాతర, పరిసర అటవీ ప్రాంతాలు అన్నింటిని కలిపి తెలంగాణ గిరిజన, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణా సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు సులభంగా మేడారం చేరుకునేలా ఏర్పాటు చేశారు.

## మేడారంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

ములుగు,జనవరి23(ప్రభాత జాగృతి) : దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు హాజరయ్యే కోట్లాది మంది భక్తులకు సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మేడారం జాతర ప్రాంతం మొత్తంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ప్రధానంగా ఈ జాతరకు హాజరయ్యే భక్తులకు తాగునీటి సౌకర్యం, అన్ని టాయిలెట్ బ్లాక్స్ వద్ద నిరంతర నీటి సదుపాయం, అన్ని ప్రభుత్వ శాఖల వద్ద తాగునీటి సౌకర్యం, పెద్ద సంఖ్యలో టాయిలెట్ బ్లాకుల నిర్మాణం చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం– మిషన్ భగీరథ ఆధ్వర్యంలో దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో, 517 బ్యాటరీ ఆఫ్ ట్యాప్, 47 సిస్టెర్న్, 312 సిస్టెర్న్ ట్యాప్ , 10 చలివేంద్రాలున్నాయి. 2024 జాతరలో 5222 నల్లాలు మాత్రమే ఏర్పాటు చేయగా ఈసారి జాతరకు 5500 నల్లాలు ఏర్పాటుచేయడం జరిగింది. ఈజాతరకు గాను రూ. 13.70 కోట్ల వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం– మిషన్ భగీరథ శాఖ ద్వారా 57 పనులను చేపట్టడం జరిగింది. గతంలో ఉన్న సదుపాయాలకు అదనంగా, ఒక అధిక సామర్థ్యం కలిగిన బోర్ వెల్, రెండు బోరెవెల్-పంప్స్, ఐదు కొత్త సిస్టెర్న్, ఒక కొత్త ఓ.ఎచ్.ఎస్.ఆర్, 26 టాయిలెట్ బ్లాక్స్, ఒక క్యూ-లైన్ నిర్మాణం, మరో 9 ఇతర పనులను చేపట్టి పూర్తి చేశారు. మేడారం ప్రధాన ఆలయం పరిసరాలు, జాతీయ రహదారి, పార్కింగ్ ప్రాంతాలు, వివిధ గ్రామాల నుండి వచ్చే దారులు, చెరువుల సమీపంలో ఈ తాగునీటి సౌకర్యంతోపాటు టాయిలెట్ లను ఏర్పాటు చేసారు. మేడారానికి వచ్చే లక్షలాది భక్తుల సౌకర్యార్థం మేడారం తోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో దాదాపు 5700 టాయిలెట్లను తాత్కాలికంగా నిర్మించారు. మొత్తం 285 టాయిలెట్ బ్లాకులుగా ఏర్పాటు చేసి వీటిని పరిశుభ్రంగా నిర్వహించేందుకు 255 సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. రోజుకు మూడు షిఫ్టులుగా పనిచేసి ఈ పారిశుధ్య సిబ్బంది, జాతర మొత్తం ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తను ఏరివేస్తారు. పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు, జాతర మొత్తాన్ని 25 సెక్టారులుగా విభజించి 526 పర్యవేక్షక అధికారులను నియమించారు.

## ఫోన్ ట్యాపింగ్ సర్వసాధారణం

విధంగా సమాచారం సేకరించినట్లు ప్రధాని, ముఖ్యమంత్రికి కూడా చెప్పరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు సజ్జనార్ విచారణ ఎదుర్కొంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆ రోజు నోటుకు ఓటు కేసులో సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ చేశాడని కేసులు పెట్టారని అన్నారు. ఇప్పుడు అదే సజ్జనార్ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ చేస్తా అంటున్నాడని అన్నారు. రాజకీయ నాయకులను వేధించడానికి ఏర్పాటు చేసిన సిట్‌కు సజ్జనార్ చీఫ్‌గా ఉన్నాడని తెలిపారు. సజ్జనార్ సిట్‌ను లీడ్ చేసి, ట్యాపింగ్ వ్యవహారాన్ని విచారించే నైతిక అర్హత లేదన్నారు. రూ.50లక్షలతో దొరికినప్పుడు సీఐడీ డీసీపీగా కూడా సజ్జనార్ ఉన్నారని.. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఉన్నాడన్నారు. ఆనాడు సజ్జనార్, ఇంకా కొంతమంది అధికారులు తమ ఫోన్లు ట్యాప్ చేశారని ఏపీలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఏ అర్హతతో ట్యాపింగ్ విచారణ చేస్తున్నారో చెప్పాలని సజ్జనార్‌ను డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్‌రావుపై పెట్టిన కేసు చెల్లదని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. అయినప్పటికీ ఆయన్ను సిట్ విచారణకు పిలిచిందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ తప్పు కాదని రేవంత్ రెడ్డినే గతంలో చెప్పాడు అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ దేశ రక్షణ కోసం పోలీసులు చేస్తారు. ఫోన్ ట్యాప్ చేయడం నేరం కాదని.. దేశ రక్షణ కోసం ట్యాపింగ్ చేయవచ్చని నాడు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ చెప్పిన వీడియోని చూపించారు. మరి ఈ రోజు ఇదే ముఖ్యమంత్రి బీఆర్ఎస్ నేతలపై ట్యాపింగ్ మీద కేసులు పెడుతున్నాడని విమర్శించారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తాయి.కానీ దాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బజారున పడేసిందని మండిపడ్డారు. తెలంగాణలోని సంపదను పక్క రాష్ట్రాలు దోచుకుంటున్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ నేతల దోపిడీని, అవినీతిని బీఆర్ఎస్ అడ్డుకుంటుందని అన్నారు. తెలంగాణ రక్షణ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వీరోచిత పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. నైనీ బొగ్గు గని దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని తెలిపారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతుందని అన్నారు. ఫార్ములా ఈ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు పెట్టారని అన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసులతో వేధిస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌కు సంబంధం లేని కేసులో విచారణకు పిలిచారని అన్నారు. కేటీఆర్‌ను విచారణకు పిలవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మహిళా శక్తికి ఐద్వా చిరునామా కావాలి

ములుగు,జనవరి23(ప్రభాత జాగృతి) : నిరంతర విద్యుత్ కాంతులతో మేడారం తళుకులీను తోంది. ప్రత్యేక ఏర్పాట్లతో రెప్పపాటు విద్యుతు పోకుండా చర్యలు తీసుకున్నారు. మేడారం జాతరలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు రూ.5కోట్ల నిధులతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈనెల 28నుంచి మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతర పరసరాల్లో ఎటు చూసినా విద్యుత్ కాంతులు జిగేల్ అంటున్నాయి. జాతరను సక్సెస్ చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఐదు రోజులు నిర్విరామంగా విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే సత్వరమే పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జాతర పరిసరాల్లో ఎలాంటి అంతరాయలు లేకుండా ముందస్తుగా నివారించడం తోపాటు అనుకోకుండా అంతరాయం ఏర్పడితే సత్వరమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు 50 బృందాలను సిద్ధం చేశారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేసిన నార్లాపూర్ సబ్‌స్టేషన్ నుంచి పార్కింగ్ కేంద్రాలకు, పరిసర ప్రాంతాల్లోని దుకాణాలకు, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.జాతర పరిధిలో 193 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా, కొత్తగా నార్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. వీటి నిరన్ చేసేందుకు ఆపరేషన్, ప్రాజెక్టు డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఇద్దరు సీజీఎంలు, ఏడుగురు డీఈలు, 20 మంది ఏడీఈ లు, 150మంది ఇంజనీర్లు, మెంటెనెన్స్ సిబ్బంది కలిపి 350 మంది వరకు విధుల్లో నిమగ్నం కాబోతున్నట్లు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం వెల్లడించింది. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక బృందం చొప్పున పర్యవేక్షించనుంది. 33 కేవీ లైన్స్ పర్యవేక్షణకు తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట, చెల్పూర్, ఏటూరునాగారం, కమలాపూర్, ములుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఇవే ప్రాంతాల్లోని ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ సరఫరా పర్యవేక్షించేందుకు 20 మంది ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు.

## బిఆర్ఎస్ నేతలతో కెటిఆర్,హరీష్ రావుల భేటీ



హైదరాబాద్,జనవరి23(ప్రభాత జాగృతి) :సిట్ కార్యాలయానికి వెళ్ళేముందు తెలంగాణ భవన్ లోపల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయిన కేటీఆర్, హరీష్ రావు లు..భేటీ అయ్యారు. ఆతర్వాత కేటీఆర్ మీడియా తో మాట్లాడారు. ఈ కేసులో ఏమీ లేదు. మాకు ఏం సంబంధం లేదని కేటీఆర్ తెలిపారు. పదిసార్లు పిలిచినా హాజరవుతా.. అటెన్షన్ డైవర్షన్ కోసమే ఈ కుట్రలు అని మండిపడ్డారు. రేవంత్.. తన మంత్రులతో సహా మా అందరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు. రూ.50 లక్షలతో నోటుకు ఓటులో దొరికిన ఒక దొంగ ఇవాళ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే.. ఈ రాజకీయ కక్ష సాధింపులు అని అన్నారు. 6 గ్యారెంటీల మోసం, 420 హామీల దగా, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ కుతంత్రాలు అని ్ ÷ర్ అయ్యారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ ను బొంద పెట్టేదాకా నిద్రపోం అని కేటీఆర్ తెలిపారు. విచారణలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామని వెల్లడించారు. ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది.. కెసిఆర్ సైనికులుగా ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్ ది అని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో పదేళ్లు అధికారంలో ఉన్నాము. మేము ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు.. మేము టైం పాస్ రాజకీయాలు చేయలేదు.. ప్రతిపక్షాలను వేధించ లేదన్నారు. విచారణలకు భయపడే వారు ఎవరూ లేరని తెలిపారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయి లాగా మారిందని ఎద్దేవ చేశారు. రోజుకో అంశం తో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. పుట్టిన భూమి సాక్షిగా అక్రమ, అనైతిక పనులు నేను చేయలేదు. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. నాకు హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేశారన్నారు. మా కుటుంబాలను ఇబ్బంది పెట్టారు.. అయినా నేను ఎప్పుడూ భయపడలేదు.. హీరోయిన్ ల ఫోన్ లు ట్యాప్ అయ్యాయని మీరే లీకులు ఇచ్చారు.. మళ్ళీ ఏమి లేదని మీరే అన్నారు. ఈ రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్ లు ట్యాప్ అవ్వడం లేదని పోలీసులు చెబుతారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీ శివదర్ రెడ్డి మీడియా ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బొగ్గు స్కాం ను హరీష్ రావు బయట పెట్టారు.. మంత్రులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదు.. హరీష్ రావు కు నోటీసులు ఇచ్చి పిలిస్తే.. వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో అలా చెప్పాడని తెలిపారు. రాష్ట్రంలో దోపిడి దొంగల ముఠా ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో కొందరు పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

## ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

మీ అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణిలో సోలార్ పవర్ స్కాం బయటపడిందని ఆరోపించారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని తెలిపారు. నేడు సింగరేణి సృజన్ గనిగా మారిందని విమర్శలు చేశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రుల పంచాయతీ కాంగ్రెస్‌కు ఉరితాడులా మారిందని ఆక్షేపించారు. సృజన్ వ్యవహారం బయటపెట్టిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేదని విమర్శించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహించారు. సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. లోపల ఏదో జరుగుతోందని తప్పుడు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు. కుంభకోణం ఎలా బయటకు వచ్చిందని వారంతా తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. సింగరేణిలో 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో పెద్ద కుంభకోణం జరిగింది. ఎంఎస్ఎంఈలు పాల్గొనకూడదని మూడింటికి కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. సోలార్ పవర్ టెండర్ అనుమతులు కఠినం చేశారు. ప్రభుత్వం అనుకున్న వారికి టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.3కోట్లు అవుతుంది. రాష్ట్రంలో మాత్రం ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తికి రూ.5.04 కోట్లు ఇచ్చారు. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చారు. సింగరేణిలో సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.214 కోట్లు అదనంగా చెల్లించారు. సింగరేణిలో మరో సోలార్ పవర్‌ప్లాంట్‌లోనూ స్కామ్ చేశారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే కిషన్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారన్నారు.

## మేడారంలో జనజాతర

సికింద్రాబాద్ చేరుకుంటాయి. నిజామాబాద్–వరంగల్– నిజామాబాద్ మేడారం జాతర ప్రత్యేక రైళ్లు (07498/07499) ఈ నెల 28 నుంచి 31 వరకు రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు నిజామాబాద్‌లో ఉదయం 7.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ చేరుకుంటాయి. తిరిగి అదే రోజు మధ్యాహ్నం 2.40 గంటలకు వరంగల్‌లో బయలుదేరి అదే రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్ చేరుకుంటాయి. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఖమ్మం–కాజీపేట– ఖమ్మం మేడారం ప్రత్యేక రైళ్లు (07503/07504) ఉదయం 10 గంటలకు ఖమ్మంలో బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు కాజీపేట చేరుకుంటాయి. తిరిగి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కాజీపేటలో బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు ఖమ్మం చేరుకుంటాయి. ఆదిలాబాద్–కాజీపేట (07501)మేడారం జాతర ప్రత్యేక రైలు ఈ నెల 28న రాత్రి 11.30 గంటలకు ఆదిలాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు (29 తేదీ) ఉదయం 11.45 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. అలాగే కాజిపేట– ఆదిలాబాద్ (07502)మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేది మధ్యాహ్నం 1.15 గంటలకు కాజీపేటలో బయలుదేరి మరుసటి రోజు (30వ తేదీ) తెల్లవారు జామున 4 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుంది.

## టీవీ సీరియల్‌లా సాగుతున్న సిట్ విచారణ

కరీంనగర్,జనవరి23(ప్రభాత జాగృతి) :ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దొంగే దొంగ అన్నట్లు కేటీఆర్ వ్యవహారం ఉందన్నారు. కరీంనగ ర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని విమర్శించారు. కేటీఆర్ సిరిసిల్ల కేంద్రంగా అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేయించారు. ఆయన చేసిన దారుణాలతో కొన్ని కుటుంబాలు మునిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్టులు జరగవు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్ చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని తేలిపోయింద న్నారు. దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్‌కు..తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధమే లేదు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. సిట్‌లో మంచి అధికారులు ఉన్నారు.. కానీ ప్రభుత్వం వారికి స్వేచ్ఛను ఇవ్వడం లేదన్నారు. ఈ కేసులో ఒక్క రాజకీయ నేతనైనా అరెస్ట్ చేశారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు చేపట్టేవాళ్లం. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చాలా మంది పారిశ్రామిక వేత్తలను బెదిరించి కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. సినిమా హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేసి లాభపడ్డారని ఆరోపించారు. స్వయంగా తన ఫోన్ ట్యాప్ అయిందని సీఎం,పలువురు మంత్రులే చెప్పారన్నారు.. జడ్జిల ఫోన్లు, ప్రతిపక్ష నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని బండి సంజయ్ చెప్పారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందన్నారు బండి సంజయ్. ఎలక్టోర్ బాండ్ల పేరుతో బీఆర్ఎస్ కోట్లు వసూలు చేసిందన్నారు. ఎంత మంది ఆస్తులను జప్తు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ పోలీస్ అధికారి ప్రభాకర్ రావును కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇంత హడావుడి చేస్తున్న సిట్ ఏం సాధించిందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఒక్క రాజకీయ నేతను అరెస్ట్ చేయలేదన్నారు. కాంగ్రెస్ కొండను తవ్వి ఎలుకను పట్టుకోలేకపోతుంద న్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సిట్ విచారణ పేరుతో ప్రభుత్వం టైం పాస్ చేస్తుందన్నారు బండి సంజయ్. స్వయంగా కేసీఆర్ కూతురే ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు. కేసీఆర్ భయానికి యాచకులు కూడా వాట్సప్ కాల్స్ మాట్లాడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే ఫోన్ ట్యాపింగ్ పై కంప్లైంట్ చేశానని బండి సంజయ్. తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన సిట్‌లో ఆఫీసర్లు నిజాయితీ పరులని.. వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు బండి సంజయ్. అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేయడానికి హడావిడి చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము

## చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

**హైదరాబాద్,జనవరి23**(ప్రభాత జాగృతి) : మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు శుక్రవారం హాజరైన అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ స్పందించారు. ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపామని స్పష్టం చేశారు. సాక్ష్యులను ప్రభావితం చేయొద్దని చెప్పామని తెలిపారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పామని ప్రస్తావించారు. కేటీఆర్‌ను ఒంటరిగానే విచారించామని సజ్జనార్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే జరిగిందని వివరించారు. ఇందులో ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు, వ్యక్తులు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. దర్యాప్తు సంస్థకు ఇలాంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతోందని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్), నిఘా పెట్టారనే ఆరోపణలపై తాము విచారణ చేస్తున్నామని సజ్జనార్ స్పష్టం చేశారు.

## అమెరికా మరో సంచలన నిర్ణయం

**వాషింగ్టన్,జనవరి23**(ప్రభాత జాగృతి) :కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్ వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్ వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించా రు. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు.



## వ్యవసాయం ఓ విజ్ఞానం

నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 'వ్యవసాయం ఒక విజ్ఞానమని', ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రొసీడింగ్స్ ను అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటీ ,ఏఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని, సాఫ్ట్ వెర్, ఐటి సెక్టార్ ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయని అన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రం గా మారిందని, వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడారు. మ్మెల్సీ శంకర్ నాయక్ వందన సమర్పణ చేయగా, పార్లమెంట్ సభ్యులు కుందూర్ రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జయవేర్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా ఎస్పీ కే. నరసింహ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనగణనకు కేంద్రం రంగం సిద్ధం



న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ):దేశ వ్యాప్తంగా జనగణనకు రంగం సిద్ధమైంది. రెండు దశల్లో జనగణన చేపట్టాలని ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జనగణనలోనే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ జనగణన ప్రారంభం కానుంది. తొలిదశలో గృహ గణన కోసం కేంద్ర హోం శాఖ ప్రశ్నావళిని రూపొందించింది. 33 ప్రశ్నలతో మోదీ సర్కార్ గెజిట్ విడుదల చేసింది. ఇంటి వివరాలతో పాటు ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం, వాహన వినియోగం వంటి వివరాలు కూడా సేకరించాలని ఆదేశించింది. కుటుంబంలో ఎవరెవరు ఏయే పని చేస్తున్నారో స్పష్టమైన వివరాలు సేకరించాల్సిదే కేంద్రం తేల్చి చెప్పింది. ఏ విధమైన మరుగుదొడ్డి ఉందో రికార్డుల్లో స్పష్టంగా చెప్పాలని గణన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్నానాల కోసం ఏ తరహా బాత్‌రూం ఉందో వివరాల్లో పొందుపరచాలని తెలపాలని వెల్లడించింది. వంట కోసం వాడుతున్న గ్యాస్ కనెక్షన్ వివరాలను కూడా అధికారులు సేకరించనున్నారు. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టీ, ఇతర ఏ వర్గానికి చెందిన వారో అనే వివరాలు తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది.

## ప్రయాణం కన్నా..ప్రాణం ముఖ్యం

**హైదరాబాద్,జనవరి23**(ప్రభాత జాగృతి) : మానవ ప్రాణం అమూల్యమైనదని, ప్రతీఒక్కరూ తమ ప్రాణాలతో పాటు తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈరోజు కూకట్ పల్లి రంగధాముని/ ఐడీఎల్ చెరువు వద్ద సైబరాబాద్ సీపీ సిబ్బందితో కలిసి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులను సీపీ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 'స్టార్ట్ ఎర్లీ ? గో స్లోలీ రీచ్ సేఫ్లీ' అనే నినాదాన్ని అందరూ ఆచరించాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఈ ప్రమాదాలు తగ్గించడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో.. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో జనవరి 13 నుంచి 23 వరకూ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలను వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర ప్రాంతాల్లో ప్రజలందరినీ భాగస్వాములుగా చేసుకుంటూ నిర్వహించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొండపూర్ ఆర్టీఓ ఆఫీసులో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం వంటి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

బాలానగర్‌లో హెచ్ఏఎల్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన 'అరైవ్ అలైవ్'లో భాగంగా కూకట్ పల్లి డీసీపీ రితీరాజ్, ఐపీఎస్., మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్య చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలన్నదే' మా లక్ష్యమన్నారు. మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ముఖ్య ఉద్దేశమన్నారు. ఓవర్ స్పీడింగ్ ప్రమాదకరమన్నారు. 20 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ ఉన్న దగ్గర 40 కిలోమీటర్ల స్పీడ్, 40 ఉన్న చోట 60 కిలోమీటర్ల వేగం, 100 కిలోమీటర్ల స్పీడ్ వెళ్లడం ప్రమాదాలకు కారణమన్నారు. కూకట్పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ ఎ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు మన కోసమే ఉన్నాయని, రోడ్డుపైకి వచ్చాక కుటుంబాన్ని గుర్తు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నెమ్మదిగా వెళ్లాలన్నారు. అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా కాలేజీలు, ఆటో టాక్సీ డ్రైవర్లకు, ప్రజలకు కూడళ్ల వద్ద ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మోటార్ ట్రాన్స్ పోర్ట్ నియమాలు గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు అధికారులు వివిధ కార్యక్రమాలు లో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు పాఠశాలల్లో క్విజ్, రంగోలి, వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు పంపిణీ, ప్రతిజ్ఞలు, బాధితుల గాథల ద్వారా ప్రజలకు మరింత స్ఫూర్తినిచ్చే వివిధ కార్యక్రమాలు నిర్వాహించారు.

# మున్సిపల్ పోరుకు రె"ఢీ"






- ఖరారైన మేయర్, వార్డ్ల రిజర్వేషన్‌లు
- విస్తృత ప్రచారానికి తీవ్ర ప్రయత్నాలు
- ప్రజా సంఘాల మద్దతుకు పాట్లు

**కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఎలక్షన్ కమీషన్ అధికారుల సమన్వయంతో ఎలక్షన్ కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే మునిసిపాలిటీలలో, మున్సిపల్ కార్పొరేషన్ లలో ఆశావాహుల ప్రచార సందడి మొదలయ్యింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో కూడా ఎన్నికల సందడి మొదలైంది. రిజర్వేషన్ లకు అనుకూలంగా అభ్యర్థులు ఎన్నికలలో గెలుపునకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. మహిళలకు రిజర్వ్ చేయబడిన స్థానాలలో కుటుంబ సభ్యులను బరిలో దించేందుకు ఆశావాహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకోసం ముందస్తుగానే ప్రచారం మొదలు పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలవడినా, రంగంలోకి దిగేందుకు అవసరమైన డబ్బు సమీకరణలో నిమగ్నమయ్యారు.

**రిజర్వేషన్ ల ఖరారు**

మున్సిపాలిటీలలో, మున్సిపల్ కార్పొరేషన్ లలో చైర్మన్, మేయర్, డివిజన్, వార్డ్ ల రిజర్వేషన్ లు ఖరారు అయ్యాయి. కొందరికి రిజర్వేషన్ అనుకూలించగా సంతోషం వ్యక్తం చేయగా, మరికొందరికి ప్రతికూల రిజర్వేషన్ తో పోటీ నుండి తప్పుకున్నట్లేనని భావిస్తున్నారు. ఖచ్చితంగా పోటీలో ఉండాలనుకునే వారు పక్క వార్డ్ లను వెతుక్కుంటున్నారు. ఆయా పార్టీ టికెట్ ల కోసం పార్టీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**విస్తృత ప్రచారానికి యత్నాలు**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల బరిలో నిలవడానికి సిద్ధమైన వారిలో చాలా మంది ఇప్పటికే గల్లీగల్లీ తిరుగుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అప్యాయంగా పలుకరిస్తూ, వారిని ప్రసన్నం చేసుకోవడానికి యత్నిస్తున్నారు. మరికొందరు కొంతకాలంగా వార్డ్ లలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వేరే ప్రాంతాల నుండి పండుగకు సొంత ఇళ్లకు వచ్చిన ప్రజలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఓటు వేసేందుకు తప్పకుండా రావాలని మర్యాదలు చేశారు. షెడ్యూల్ వచ్చిన వెంటనే మళ్లీ వారిని కలిసేందుకు అవసరమైన సమాచారం, ఫోన్ నెంబర్ ల ను సేకరించుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కోసం ఫొటోలు, వీడియోలను సిద్ధం చేసుకుంటున్నారు.

**ప్రజా సంఘాల మద్దతుకై...**

ఆశావహులు వారివారి వార్డులలో వివిధ వర్గాలకు చెందిన సంఘాలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాలు, అభివృద్ధి సంఘాలు, కాలనీ సంఘాల వారీగా నాయకులు, సభ్యులను కలుస్తూ మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నారు. గెలిచిన తరువాత వారికి లబ్ధి చేకూర్చేందుకు హామీల వర్షం కురిపిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే తాయిలాలు ఎరగా వేసేందుకు సైతం వెనుకాడడం లేదు.

## బాలల హక్కులు, చట్టాలపై విస్తృత

# అవగాహన కల్పించాలి




- సర్పంచుల శిక్షణలో బాలల హక్కుల అంశాన్ని చేర్చాలి
- బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి

**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

బాలల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతాదయాకర్ రెడ్డితో పాటు ఐదుగురు సభ్యులు మర్రిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్ శుక్రవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని పిల్లల వార్డు, ఎన్ఐసీ కేంద్రం, మాతా శిశు కౌన్సిలింగ్ సెంటర్ సందర్శించారు. చింతకుంట అంగన్వాడి కేంద్రంలో నిర్వహిస్తున్న శుక్రవారం సభకు కమిషన్ సభ్యులు హాజరయ్యారు. కరీంనగర్ సఖి కేంద్రం, సప్తగిరి కాలనీలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని, ప్రభుత్వ అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రేకుర్తిలోని మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తల్లిపాల బ్యాంకు అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అంధులు, బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు తమకు రావలసిన దివ్యాంగుల పింఛను కోసం వారి వారి గ్రామాలకు వెళ్లకుండా ఇక్కడే పింఛన్ పొందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెరగడం మంచి విషయమని తెలిపారు. అయితే సిజేరియన్ శాతాన్ని సాధ్యమైన మేర తగ్గించాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి అంగన్వాడి కేంద్రంలో విద్యుత్ సరఫరా తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లకు దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించటం మంచి విషయమని, క్షేత్రస్థాయిలో మరింత మందిని గుర్తించి ఈ స్కూళ్లలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలు లేని దంపతులు, రక్తసంబంధీకులనుండి దత్తత తీసుకునే వారికి చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించాలని అన్నారు. సఖి కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి మహిళా చట్టాల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలల హక్కుల చట్టాల గురించి వివరించాలని, అవసరమైతే బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులను శిక్షణకు ఆహ్వానించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిడబ్ల్యుసి చైర్పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి, డిసిపిఓ పర్వీన్, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి అడ్మిన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



- హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆర్వో, ఏఆర్ఓలకు శిక్షణ

**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

పొరపాట్లకు తావివ్వకుండా మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని కరీంనగర్ నగరపాలిక, హుజురాబాద్, చొప్పదండి , జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి టీఓటీ, ఆర్వో, ఏఆర్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి *కలెక్టర్ హాజరై మాట్లాడారు* హ్యాండ్ బుక్ ను క్షుణ్ణంగా చదవి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఆర్వోల పాత్ర కీలకమన్నారు. నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి విషయం పరిశీలిస్తూ.. ఏ ఆర్ఓలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ క్రాస్ చెక్ చేసుకుంటూ సమస్యలు తలెత్తకుండా ముందు చూపుతో వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, నామినేషన్ల స్వీకరణ , స్క్రూటీని చేసే విధానం వివరించారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలవేళ అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆర్వోలు, ఏఆర్ఓలు తమ విధులను పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చూపంతా కరీంనగర్ కార్పొరేషన్ వైపే..



- మేయర్ పదవిని కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యం
- గెలిచే చోట పాతవాళ్లకే టిక్కెట్లు ఇస్తాం
- బీజేపీలోకి వచ్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రెడీగా ఉన్నారు
- కలిసికట్టుగా పనిచేద్దాం.... కాషాయ జెండా ఎగరేద్దాం
- పార్టీ నేతల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కామెంట్స్
- కేంద్ర మంత్రి సమక్షంలో 24వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సత్యనారాయణరెడ్డి చేరిక
- 56వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సహా పలువురు నేతలు బీజేపీలో చేరిక

**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

కరీంనగర్ కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందా? లేదా? అనే దానిపై రాష్ట్రమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈసారి బీజేపీకి మంచి వాతావరణం ఉందని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వారిని సాదరంగా ఆహ్వానించడంతోపాటు కలిసికట్టుగా పనిచేసి కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గెలిచే అవకాశమున్న చోట పార్టీ కార్యకర్తలకే టిక్కెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. శుక్రవారం కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్స్ లో బీజేపీ నేతల సమావేశం జరిగింది. 24వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి తన అనుచరులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అట్లాగే 56వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి తన అనుచరులతో కలిసి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లరమేశ్, సీనియర్ నేతలు ఓదేలు, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్, డాక్టర్ పుల్లెల పవన్, బోయినిపల్లి ప్రవీణ్, గుజ్జ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా సమావేశానికి హాజరైన నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ "బీజేపీలో పార్టీ నిర్ణయమే ఫైనల్. పార్టీ కంటే పెద్దోళ్లు ఎవరూ లేరు. ఎవరున్నా లేకున్నా పార్టీ కొనసాగుతుంది. గతంలో ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉండే. ఇప్పుడు వరుసగా 3సార్లు అధికారంలో కొనసాగుతోంది."అని చెప్పారు. దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ వారసత్వ కుటుంబ రాజకీయాలతో దేశాన్ని కుంటుపడేసిందన్నారు. అట్లాంటి కాంగ్రెస్ పార్టీని ఈ దేశంలో లేకుండా చేయడమే లక్ష్యంగా మోదీ నాయకత్వంలో కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదంతో కసితో పనిచేస్తున్నామని చెప్పారు. "కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకే పరిమితమైంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కసితో పనిచేస్తున్న జిల్లాల్లో కరీంనగర్ అగ్రస్థానంలో ఉంది. ప్రజా సంగ్రామ యాత్ర సక్సెస్ లో కరీంనగర్ జిల్లా కార్యకర్తల భాగస్వామ్యం చాలా ఎక్కువ. కరీంనగర్ కార్యకర్తల సహకారంవల్లే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సక్సెస్ అయిన. ఈ నేపథ్యంలో కరీంనగర్ కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందా? లేదా? అనే దానిపై రాష్ట్రమంతా ఎదురు చూస్తోంది"అని పేర్కొన్నారు. "బీజేపీకి అద్భుతమైన మంచి వాతావరణం ఉంది. ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున నాయకులు రావడానికి సద్ధంగా ఉన్నారు. వాళ్లను రానీయకుండా కొందరు అడ్డుకోవాలనుకుంటున్నారు. ఇది సరికాదు. కరీంనగర్ మేయర్ సీటును బీజేపీ కైవసం చేసుకోవాలంటే... అందరం కలిసి పనిచేయాలి"అని కోరారు. కరీంనగర్ మేయర్ సీటును కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, అందుకోసం దేనికైనా తెగించడానికి సిద్ధపడదామని చెప్పారు. ఎన్నడూ లేనివిధంగా కార్పొరేషన్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తాకిడి ఎక్కువగా ఉందని, ఒక్కో డివిజన్ కు 20 మందికిపైగా టిక్కెట్ ఆశిస్తున్నారని చెప్పారు. గెలిచే అవకాశమున్న చోట పాత కార్యకర్తలకే తప్పనిసరిగా టిక్కెట్లు ఇస్తామని, కష్టపడినా గెలిచే అవకాశం లేనిచోట ప్రత్యామ్నాయం చూస్తామని తెలిపారు. వివిధ సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లు ఇస్తామని, టిక్కెట్లు రానివారిని సముదాయించాల్సిన బాధ్యత జోన్ అధ్యక్షులు, పార్టీ నేతలపైనే ఉందని చెప్పారు. "వివిధ పార్టీలకు చెందిన నేతలు బీజేపీలోకి వచ్చినా వాళ్లకే టిక్కెట్లు గ్యారంటీగా ఇస్తామనే అవకాశమే లేదు. అంతిమంగా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లు కేటాయింపు ఉంటుంది"అని స్పష్టం చేశారు.

# యువ ప్రతిభను ప్రోత్సహించడంలో టీజీఐసీ కీలకపాత్ర






- ఆవిష్కరణలు పోటీకి తట్టుకునేలా ఉండాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

యువత ప్రతిభను ప్రోత్సహించడంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టి జి ఐ సి) కీలక పాత్ర పోషిస్తున్నదని, వారి ఆవిష్కరణలు పోటీ మార్కెట్ కు తట్టుకునే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాలో ఉన్న ఔత్సాహిక ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ప్రోత్సహించడంలో భాగంగా తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ కరీంనగర్ లోని ఐటీ టవర్ లో "ఇన్నోవేషన్ పంచాయత్ " కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సదస్సుకు కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుండి 60కి పైగా ఔత్సాహిక వ్యవస్థాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. నిధుల సేకరణ, వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ మెళకువలకు సంబంధించి తమకున్న సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆవిష్కరణ సవాలతో కూడినదని, వాటిని అమలు చేసే సమయంలో ఎన్నో అడ్డంకులు, లోపాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. వాస్తవ ప్రపంచానికి తగినట్లుగా ఉత్పత్తిని తీర్చిదిద్దడం చాలా అవసరమని తెలిపారు. ఆవిష్కరణలో వచ్చే కష్టాలు విజయానికి మార్గాలుగా భావించి వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన ఆలోచనలు సమాజంలో ప్రభావవంతమైన పరిష్కారాలుగా మారాలని ఆకాంక్షించారు. యువత, విద్యార్థులు తమ ఆవిష్కరణలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మాత్రమే ఆధారపడకుండా మార్కెట్లో స్వతంత్రంగా నిలబడే స్థిరత్వాన్ని కలిగి ఉండాలని అన్నారు. కాలానికనుగుణంగా తమ సాంకేతికను మార్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. తెలంగాణలో యువత సృజనాత్మకత కొదువ లేదని, సరైన మార్కెట్ తోడైతే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ సీఈవో మేరాజ్ ఫహీమ్, కమ్యూనికేషన్ మేనేజర్ బుద్ధవరపు వాణి పాల్గొన్నారు.

# సర్పంచ్ పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేయాలి

- నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధిపై పూర్తి దృష్టి పెట్టాలి
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, జనవరి 23 ( ప్రభాత జాగృతి )**




సర్పంచ్ పదవికి వన్నె తెచ్చే విదంగా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఓరియంటేషన్ కార్యక్రమంలో వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచులు వ్యక్తిగత సమస్యలకు కాకుండా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు ,జిల్లా పరిషత్తుల మధ్య నిధుల కేటాయింపులో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా అవసరాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారో ప్రజలు దగ్గరగా చూస్తే అర్థమవుతుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పేద పిల్లలకు నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ స్కూల్స్ ను 25 ఎకరాల్లో, ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. అలాగే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలోనూ నిమ్స్‌లో 2500 పడకలు, నయా ఉస్మానియా ప్రాజెక్టు, ఫీల్డ్ హాస్పిటల్స్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు, రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా విద్యారంగంలో చారిత్రాత్మక మార్పులు తీసుకొస్తున్నామని అన్నారు. తాను ఎంపిటీసీ, జెడ్పిటీసీ, ఎంపీపీగా పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేసిన ఆది శ్రీనివాస్, ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజల ఆదరణ లభిస్తుందని తెలిపారు. సర్పంచ్ పదవి నుంచే ఎమ్మెల్యే స్థాయికి ఎదగడానికి పునాది పడుతుందన్నారు. గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు పోతే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు..నూతన సర్పంచ్ పాలకవర్గం గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని,గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటయని అన్నారు.. ప్రజల మనస్సు గెలుచుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ గ్రామాల్లో మంచి పేరు సంపాదించాలని సర్పంచులకు పిలుపునిచ్చారు.

# ప్రమాణాలతో కూడిన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయం

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వెల్లడి**

**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి )**



అన్నివర్గాలకు చెందిన పేద విద్యార్థులందరికీ ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యాదవులపల్లిలోని ప్రభుత్వం 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో అన్నివర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నదని, అందులో భాగంగానే తొలి విడుతలో మానకొండూర్ నియోజకవర్గానికి మంజూరైన స్కూల్ ను యాదవులపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు. 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన సుమారు 3వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతారన్నారు.4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీటిలో అడ్మినిస్ట్రేష్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, బాలురు, బాలికల హాస్టల్ బ్లాకులు నిర్మిస్తారని, బోధన, బోధనేతర సిబ్బందికి కూడా నివాస సముదాయాలు ఇందులో ఉంటాయని, ఒక్కో భవంతి నిర్మాణానికి రూ. 135 కోట్లు , ఇతరత్రా అవసరాలు, పనుల కోసం అదనంగా రూ.65కోట్లు వెరసి రూ.200 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించిందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వివరించారు.ఈ స్కూళ్లలో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, క్రీడా సౌకర్యాలతో సమగ్ర అభివృద్ధిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన చెప్పారు. అన్నివర్గాల విద్యార్థులకు ఒకేచోట నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో భవన నిర్మాణాలు పూర్తి చేసుకొని అందుబాటులోకి వస్తుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు పేద విద్యార్థులకు వరంలాంటిదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పాలకులకు భిన్నంగా విద్య,వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థను ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల లేని, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండేదని, ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతుల వంటి డిమాండ్లను గత ప్రభుత్వం తీర్చలేకపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసిందని ఆయన గుర్తు చేశారు.ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రవేశ పెట్టినా పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్నదని, అందులో భాగంగానే ఆరు పథకాలను ప్రభుత్వం అమలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్యతోనే ఉన్నతి సాధించవచ్చని, విద్యార్థులు భవిష్యత్తు బంగారుమయం చేసుకునేందుకు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యతోనే ఉన్నతస్థానాలను అధిరోహించిన వారిలో ఏపీజే అబ్దుల్ కలాం వంటి వారెందరో ఉన్నారని, వారందరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతును రాజును చేయాలనే సంకల్పంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందకు సాగుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.అందులో భాగంగానే 2 లక్షల వరకు రుణ మాఫీ, రైతు భరోసా వంటి పథకాలతో రైతులను ఆదుకుంటున్నదని చెప్పారు. అంతే కాకుండా రాయితీపై విత్తనాలు, ఎరువులతోపాటు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేస్తున్నదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో వివక్షతకు గురైన రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతున్నదని చెప్పారు. విద్య,వైద్యం వంటి అనేక రంగాలు,వ్యవస్థలు విధ్వంసాలకు గురయ్యాయన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, రైతులను సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం సరికదా రైతులకు బేడీలు వేసిన ఘన చరిత్ర గత పాలకులకే దక్కిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ, రైతు భరోసాతోపాటు పంటలకు మద్దతు ధర కల్పించిందని, అంతేకాకుండా 500 రూపాయలు బోనస్ కూడా ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎవరి పాలన బాగుందో ప్రజలు బేరీజు వేసుకోవాలని ఆయన సూచించారు.ఆర్థికపరమైన సమస్యలను చక్కదిద్దుకుంటూనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వైపు ముందుకు సాగుతున్నదని సత్తు మల్లేశం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ ఏ.అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జె.భాగ్యలక్ష్మి, సహాయ వ్యవసా సంచాలకులు ఎన్.శ్రీధర్, తిమ్మాపూర్ తహశీల్దార్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ఎన్.ఆర్, మల్హోత్రా, మండల విద్యాధికారి వి.శ్రీనివాస్, మానకొండూర్ మండల విద్యాధికారి ఎం.మదుసూదనాచారి, తిమ్మాపూర్ మండల వైద్యాధికారి డాక్టర్ ప్రస్కిల్లా, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మి నారాయణ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్(తిమ్మాపూర్), నందగిరి రవీంద్రచారి(మానకొండూర్), గోపగోని బస్వయ్యగౌడ్(శంకరపట్నం), ముస్కు ఉపేందర్ రెడ్డి(గన్నేరువరం), పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, గోపు మల్లారెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు హాజరయ్యారు.

**వ్యవసాయ యంత్రాలు,పనిముట్ల పంపిణీ**

వ్యవసాయశాఖ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మానకొండూర్,శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు మంజూరైన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రైతులకు అందజేశారు. ఆయా మండలాలకు చెందిన 36 మంది రైతులకు 33.35 లక్షల రూపాయల రాయితీతో ఈ యంత్రాలు,పనిముట్లను శుక్రవారం యాదవులపల్లి గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వాటిలో స్ట్రా బేలర్లు, కేజ్ వీల్స్, కల్టివేటర్లు, రొటోవేటర్లు, పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ ,మ్యాన్వల్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జె.భాగ్యలక్ష్మి, ఏడీఏ శ్రీధర్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు కె.శ్రీనివాస్ రెడ్డి, జె.సురేందర్, జె.కిరణ్మయి, టెక్నికల్ ఏవో టి.రమ్యశ్రీతోపాటు రైతులు తదితరులు ఉన్నారు.

**చేనేత కార్మికులకు రుణమాఫీ పత్రాల అందజేత**

చేనేత కార్మికుల రుణమాఫీ పథకం కింద మానకొండూర్ మండలం ఊటూరు చేనేత పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన 32 మంది నేత కార్మికులకు రుణమాఫీ పత్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. యాదవులపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యక కార్యక్రమంలో చేనేత కార్మికులకు ఆ చెక్కులను అందజేశారు. 32 మంది నేత కార్మికులకు 20,19,500 రూపాయల మేరకు రుణ మాఫీ జరిగింది. ఈ రుణమాఫీ పత్రాల జారీ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ సహాయ సంచాలకుడు జి.రాఘవరావు, అభివృద్ధి అధికారి అజహర్ వాహబ్, ఊటూరు చేనేత సంఘం చైర్మన్ ఊషకోయిల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్ మండల సర్పంచులకు సన్మానం**

తిమ్మాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల నూతన సర్పంచులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. తిమ్మాపూర్ పంచాయతీ పరిధిలోని యాదవులపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ సర్పంచులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, తిమ్మాపూర్ మండల ఎంపీడీవో మల్హోత్రా, మండల తహసీల్దార్ కె.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబం ఇంటి నిర్మాణానికి 20వేలు అందజేసిన గడ్డం స్వామి రెడ్డి

**తక్షణం స్పందించిన స్వామి రెడ్డిని అభినందిస్తున్న మండల ప్రజలు..**




**చిగురుమామిడి, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):** ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు ఓ పేద కుటుంబం సహాయం కోరగానే వెంటనే స్పందించి 20వేల రూపాయల విలువ చేసే ఇటుకను ఇప్పించి పెద్ద మనసును చాటుకున్నారు ఓగులాపూర్ గ్రామానికి చెందిన గడ్డం స్వామి రెడ్డి.వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన బోయిని పద్మ పరుశయ్యలు నిలువ నీడ లేక ఇల్లు కట్టుకుందామంటే ఆర్థికంగా లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన గడ్డం స్వామి రెడ్డి దృష్టికి తమ పరిస్థితిని తీసుకెళ్లారు.వారి దయనీయ పరిస్థితిని చూసి వెంటనే స్పందించిన స్వామి రెడ్డి ఇంటి నిర్మాణం కోసం 20వేల రూపాయల విలువగల ఇట్టుకను అందజేశారు. తాము అడిగిన వెంటనే సహాయం తమ పరిస్థితిని చూసి ఆర్థిక సహాయం చేసిన స్వామి రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.పేద కుటుంబానికి తక్షణ సహాయం చేసిన గడ్డం స్వామి రెడ్డిని గ్రామ,మండల ప్రజలు అభినందిస్తున్నారు.

## ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి

**జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ , అధికారులు, కార్యాలయ ఉద్యోగులతో కలెక్టర్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంవత్సరాలు 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**బెజ్జంకి, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):** దాచారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయదారుల సౌకర్యార్థం కొత్త రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బైర మానస శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి, కే సురేష్,ఉప సర్పంచ్ దీటీ బాలనర్స్, వార్డు సభ్యులు, రాజు, అశోక్, వనిత, కవిత, రాజు, సోని,ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిగురుమామిడి శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ యాజమాన్యం బంపర్ ఆఫర్

- లక్కీ డ్రా లో గెలుపొందితే పెండ్లిజంటకు సింగపూర్ ట్రిప్ ఆఫర్
- ఫంక్షన్ హాల్ బంపర్ ఆఫర్ ను సద్వినియోగం చేసుకోవాలన్న గుర్రం మురళి గౌడ్



**చిగురుమామిడి, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):** తమ ఫంక్షన్ హాల్లో పెళ్లి చేసుకునే నూతన వధూవరులకు కనివిని ఎరగని రీతిలో ఎక్కడ లేని విధంగా బంపర్ ఆఫర్ ప్రకటించారు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ యజమాన్యం....ఫంక్షన్ హాల్ గుర్రం మురళి గౌడ్ 2026వ నూతన సంవత్సర,సంక్రాంతి, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన నూతన వధూవరులకు సింగపూర్ ట్రిప్ ను ఆఫర్ చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన విశాలమైన స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని అంగులతో శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ ను నిర్మించారు.అతి తక్కువ బడ్జెట్లో వివాహాలకు తమ ఫంక్షన్ హాల్ ను అందిస్తూనే కొత్తగా పెళ్లి చేసుకునే నూతన జంటలకు సింగపూర్ ట్రిప్ ను అందిస్తున్నారు.ఫంక్షన్ హాల్ లో వివాహం అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో ఫంక్షన్ హాల్ యజమాన్యం వంద కైయిన్స్ ను ఒక డబ్బాలో వేస్తారు. పెళ్లి కుమారుడు కుమార్తె ముందే చెప్పిన లక్కీ నెంబర్ కైన్ ను తీసినట్లైతే వారు సింగపూర్ ట్రిప్ కు అర్హులవుతారు.ఇంత మంచి అవకాశాన్ని కరీంనగర్ జిల్లా ప్రజలు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీమహాలక్ష్మి ఫంక్షన్ హాల్ యజమాని గుర్రం మురళి గౌడ్ కోరారు.




## రైతులకు నష్టపరిహారం ఇచ్చేవరకు పోరాటం ఆగదు

**సర్పంచ్ నాగేందర్ పటేల్**



**ఝరాసంగం, జనవరి 23 (ప్రభాత జాగృతి ):** ఝరాసంగం మండలం బోరేగావ్ గ్రామంలో పొలాల మీద నుంచి హై టెన్షన్ లైన్ వెళ్తున్న నేపథ్యంలో సరైన నష్టపరిహారం కోసం రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒక ఎకరానికి 5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని బోరేగావ్ సర్పంచ్ నాగేందర్ పటేల్ డిమాండ్ చేశారు. సుమారు 40 మంది రైతులు తమ భూములు కోల్పోతున్నారని వారికి సరైన న్యాయం చేసే వరకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని బోరెగం సర్పంచ్ నాగేందర్ అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**కండువాలు కప్పి ఆహ్వానించినా పార్టీ ఇంచార్జ్ చెల్మెడ**



**వేములవాడ, జనవరి 23, (ప్రభాత జాగృతి):** బిఆర్ఎస్ నియెజక వర్గ ఇంఛార్జ్ చెలిమెడ లక్ష్మీ నరసింహారావు సమక్షంలో 26వ వార్డు నాయకులు చందనం శ్రీనివాస్, వార్డు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మామిండ్ల జమునకనకరాజుకి చందనం శ్రీనివాస్, సినియర్ నాయకులు ఇన్నాడి సత్యనారాయణ రెడ్డి, చీటి రాధకిషన్ రావు ఆధ్వర్యంలో సుమారు 30మంది యువకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చెల్మెడ లక్ష్మినరసింహరావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో గతంలో లాగా మున్సిపల్ లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. పట్టణ ప్రజలంతా బిఆర్ఎస్ అభ్యర్దులకు ఓటు వేసి గెలిపించాలనీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సెల్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజి కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి చందు, అంజత్ పాషా, దుర్శెట్టి ప్రేమ్ చారీ, బొల్గం దేవరాజు బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు పబ్బ శ్రీకాంత్, గంగరాజు యాదవ్, బయాన భరత్, దిలిప్ యాదవ్, రోహన్, శశీ, క్రిష్ణ, సాయి వరుణ్, రాకేష్, రాజేష్, ఆరుణ్, సురేష్, నాగిశెట్టి నారాయణ, దేవరాజు, రాజయ్య, తదితరులు ఉన్నారు.

## నూతన సర్పంచ్‌లకు శిక్షణ ధ్రువీకరణ పత్రం అందచేత

**సంగారెడ్డి, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):** శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని దుర్గాభాయి దేశముఖి మహిళా శిశు వికాస కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం ఏర్పాటుచేసిన అయిదు రోజుల శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్ ముగిసింది. తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ వారు నిర్వహించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ జనరల్ ఓరియంటేషన్ శిక్షణ ధ్రువీకరణ పత్రాలను డీపీవో జానకి రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన సర్పంచ్ లకు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న బోరెగం సర్పంచ్ నాగేందర్ పాటిల్ మాట్లాడుతూ తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేదందుకు తమ వంతు కృషిచేస్తానని అన్నారు..



## అంగళ్ళ నిర్వహణతో అదనపు ఆదాయం



**మానకొండూర్, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**

వార సంత (అంగడి)ల నిర్వహణతో గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూరు మండలం రంగపేట గ్రామంలోని సీడ్ ప్రాసెసింగ్ ప్లాంటు సమీపంలో శుక్రవారం పశువుల వారసంతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చే మార్గాలను అన్వేషించాలని, సర్పంచులు వార సంతల నిర్వహణపై దృష్టి సాధించాలని ఆయన కోరారు. వారసంతలో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు క్రయ విక్రయాలు జరుపుకోవడానికి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వారసంతల వల్ల అమ్మకం, కొనుగోలుదారులకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.వారసంతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి వరలక్ష్మి, ఎంపీవో ఎస్ సతీష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ మ్రరి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మండల కాంగ్రెస్ కంటే అధ్యక్షులు నందగిరి రవీంద్ర చారి, పార్టీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రేమిడి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, కనకం అశోక్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి,సర్పంచులు కొత్త రామిరెడ్డి, కిషన్ రావు, బొట్ల కిషన్ తోట శ్రీనివాస్, మ్యాడ తిరుపతి రెడ్డి పాకాల వందనం, బోళ్ల మురళీధర్, సాయిరి దేవయ్య, రామిడి తిరుపతి, సహదేవ్,బాపురావు, మడుపు ప్రేమ్ కుమార్,తాళ్లపల్లి నరేష్,కొండ్ర సురేష్,బక్కారెడ్డి, మ్రరి కుమార్,మ్రరి కొమురయ్య, కత్తెర్ల లక్ష్మయ్య , రాజు, ఎడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల చదువుకు శుభారంభం, వసంత పంచమి అక్షరాభ్యాసం

- జ్ఞానశక్తి మహోన్నతమైనది
- వికుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు

**వేములవాడ, జనవరి 23 ( ప్రభాత జాగృతి ):**



వసంత పంచమి సందర్భంగా వేములవాడలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీలో అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " ఏడాదిలో అత్యంత శుభదినాల్లో వసంత పంచమి ఒకటని, అందుకే మాఘమాస శుక్లపక్ష పంచమి తిథిన జరుపుకునే అక్షరాభ్యాస కార్యక్రమం చిన్నారుల జీవితంలో తొలి విద్యారంభానికి అత్యంత శుభకరంగా భావిస్తారని, ఈ శక్తివంతమైన రోజున విద్యకు, వాక్కుకు, కళలకు అధిష్టాన దేవత, జ్ఞాన స్వరూపిణి అయిన సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారని, సకల విద్యాప్రదాయని జ్ఞాన స్వరూపిణి అయిన సరస్వతి అమ్మవారు మాఘ శుక్ల పంచమి నాడు ఆవిర్భవించిందని పురాణాలు చెబుతున్నాయని, ఈ రోజున సరస్వతి అమ్మవారి ఆలయాల్లోనే కాకుండా నివాసాలు, విద్యాలయాల్లోనూ చదువుల తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, వసంత పంచమి రోజున చేసే కార్యాలకు పంచాంగ దోషాలు ఉండవని శాస్త్రాలు చెబుతున్నాయని, పిల్లలు చదువులో రాణించేందుకు ఈరోజు అక్షరాభ్యాసం చేయిస్తారని, సంగీత, కళా శిక్షణ ప్రారంభం చేయడం వల్ల చిన్నారులకు ధ్యానం, బుద్ధి, వాక్చాతుర్యం లభిస్తాయని నమ్మకం అని, చాలా విద్యాలయాల్లో సరస్వతి పూజలు చేయడంతో పాటు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి పెన్నులు, పలకలు, పుస్తకాలు పంచి పెడతారని, ఈరోజు ఈ విధంగా చేస్తే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని వారి నమ్మకం అని, అన్ని శక్తుల్లో జ్ఞానశక్తి మహోన్నతమైనదని, ప్రపంచాన్ని జయించే శక్తి జ్ఞానశక్తి ( చదువు , విజ్ఞానం) కి మాత్రమే ఉన్నదని "పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయినులు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతోనే పోటీ ప్రపంచంలో
# గెలుపుముద్దం మల్లికార్జున్ యాదవ్



**కంటోన్మెంట్: జనవరి 23: ప్రభాత జాగృతి ప్రతినిధి:** విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని అలవర్చు కోవాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తనయుడు ముద్దం మల్లికార్జున్ యాదవ్ స్పష్టం చేశారు.వసంత పంచమిని పురస్కరించుకొని ఓల్డ్ బోయిన్పల్లి మల్లికార్జున కాలనీలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నూతనంగా రూపొందించిన రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఆజాద్, ఇతర శాస్త్రవేత్తల బొమ్మలతో కూడిన ప్రత్యేక తరగతి గదులను,ప్రముఖ సామాజికవేత్త అవేర్నెస్ ట్రైనింగ్ సెంటర్ సయ్యద్ ఖజా మొయినుద్దీన్ హైమద్, పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. నేడు విద్య తోపాటు సాంకేతిక వైజ్ఞానిక అంశాల్లో విద్యార్థులకు శిక్షణ నివ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులు సైతం ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ ప్రభాకర్ రెడ్డిమాట్లాడుతూ 5, 6 ,7, 8 తరగతుల్లో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభమ య్యాయని తల్లిదండ్రులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు కృష్ణ ఆర్ట్ టీచర్, సామ్యూల్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓటరు దినోత్సవం



**గుండాల జనవరి 23(ప్రభాత జాగృతి):** గుండాల మండలంలో మోడల్ స్కూల్ లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాము మాట్లాడుతూ ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని,ఓటు హక్కు వచ్చిన ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్యంలో హక్కులతో పాటు ప్రజలకు బాధ్యతలు కూడా ఉంటాయని, ఓటు హక్కు అనేది ప్రతి ఓటరు యొక్క ప్రాథమిక బాధ్యతని,అందువల్ల ప్రతి ఒక్కరు ఎన్నికల సమయాలలో తమ ఓటు హక్కును వినియోగించుకుని పాలనలో భాగస్వాములు అవ్వాలని పేర్కొన్నారు. తదనంతరం సిబ్బంది చేత, విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, తహాసిల్దార్ హరి కృష్ణ,అకాడమిక్ కోఆర్డినేటర్ జే.చినబాబు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత చిరు వ్యాపారులకు ఎంపీ చొరవతో న్యాయం

**పన్ను పెంచితే పరేషాన్ తప్పదు: నర్మదా మల్లికార్జున్**



**కంటోన్మెంట్: జనవరి 23: ప్రభాత జాగృతి ప్రతినిధి :** బోర్డు పరిధిలో ఆస్తి పన్నుల మదింపుతో 200 శాతం పెంచితే ప్రజల పై తీవ్ర ప్రభావం చూపుతుందని నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖర్జున్ స్పష్టంచేశారు.పన్నులను 15 నుండి 20 శాతం వరకు మాత్రమే పెంచి ప్రజలపై భారం పడకుండా చూడాలని బోర్డును కోరారు. ఎస్టీ కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకునేందుకు బోర్డు చర్యలు తీసుకునే లాగున ఎంపీ ఈటెల రాజేందర్ చొరవచే తీసుకున్నారని వెల్లడించారు. ఇది ఒక శుభ పరిణామణి ఆమె స్పష్టం చేశారు రాబోయే రోజుల్లో పేదలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రామన్నకుంట అభివృద్ధి కోసం కేంద్రం నుండి ఎన్ఓసి రావాల్సి ఉందని త్వరలోనే ఎల్ఓసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుండి గ్రాంట్ రూపంలో సుమారు 15 కోట్ల రూపాయలు రానున్నట్లు ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ నిధులతో బోర్డు పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. బానుక నర్మద మల్లిఖర్జున్ శుభవార్త తెలియజేస్తూ రానున్న పక్షం రోజుల్లో రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కంటోన్మెంట్‌కు గ్రాంట్ (నిధులు) మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.ఈ సమావేశంలో బ్రిగేడియర్ రాజీవ్, ప్రెసిడెంట్, కంటోన్మెంట్ సీఈఓ అర్వింద్ కుమార్ దీవ్వేది, జాయింట్. సీఈఓ ఆశిక్ హుస్సేన్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.

# కేటీఆర్ సీట్ దర్యాప్తు ఒక డ్రామా :ఎంపీ లక్ష్మణ్



**యాదాద్రి భువనగిరి: జనవరి 23(ప్రభాత జాగృతి):** ప్రజా సమస్యల నుంచి ప్రజలను ప్రక్కదోవ పట్టించేందుకు విచారణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి డ్రామా చేస్తున్నారని భాజపా ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు.భాజాపా చేపట్టిన ఖేలో ఇండియా జీతో భువనగిరి కార్యక్రమంలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీ ఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ను ఫోన్ క్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పిలవడంపై విలేకరులు ప్రశ్నించగా, ఇదంతా డ్రామా అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక టీవీ సీరియల్ లాగా రోజుకు ఒక కేసుతో సీఎం డ్రామాలు ఆడుతున్నారే తప్ప, చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటివరకు ఒక కేసులోనైనా మాజీ ప్రజా ప్రతినిధులను అరెస్టు చేశారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. విచారణల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బలి చేస్తున్నారే తప్ప,దోషులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు? కాంగ్రెస్ బీఆర్ఎస్ లు కుమ్మక్కై సమస్యల నుంచి ప్రజల దృష్టి మార్చే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ను ఎన్నుకున్నారని, రెండేళ్లలో కాంగ్రెస్ తో విసిగిపోయి భాజపాను ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈరోజు 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న తన పార్టీ తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ తేవాలన్న లక్ష్యంతో పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేశారు.

# ఇంటిపై ఏ`ఐ'

**యాదాద్రి భువనగిరి: జనవరి 23 (ప్రభాత జాగృతి):** ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జనవరి నెలలో ప్రారంభించింది. అనర్హులకు ఇళ్ళు మంజూరు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అనర్హుల గుర్తింపునకు ఏ ఐ (కృత్రిమ మేధా) తో 360 డిగ్రీల విచారణ చేపట్టారు. అనర్హులు ఎవరో తేలిపోయింది తొలి విడుదల జిల్లాలు 10,056 ఇళ్లను మంజూరు చేశారు. వీటిలో 7,135 లో పనులు మొదలుపెట్టారు 1891 ఇళ్ళను పనులు ఇంకా మొదలు పెట్టనేలేదు. గతంలో గృహ నిర్మాణ పథకంలో లబ్ధి పొందిన వారిని కూడా తీసేస్తున్నారు. పునాది వరకు మాత్రమే నిర్మించిన వారిని వదిలేసి,ఆపైన ఇల్లు పూర్తి చేసుకున్న వారిని అనర్హుగా గుర్తించారు. కార్లు జీపులు,ఇతర నాలుగు చక్రాల వాహనాలు ఉన్న, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిని గుర్తించి లెక్క తీశారు. 10,056 మందిలో 340 మంది అనర్హులుగా తేల్చారు. వీటిల్లో 81 గృహాల నిర్మాణం చేపట్టలేదు. 20059 గృహాల నిర్మాణాలు చేపట్టారు. వీరిలో కొందరు ఒక విడత, మరికొందరు రెండు విడతల్లో బిల్లులు కూడా పొందారు. చివరకు అనర్హులని తేలడంతో వారి పరిస్థితి అయోమయంగా మారింది.

# జనవరి 30 నాటికి ఇందిరమ్మ ఇండ్లను
# 100% గ్రౌండ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష

**పెద్దపల్లి, జనవరి-23: (ప్రభాత జాగృతి):**

జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 100% గ్రౌండ్ చేయాలని *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష* అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మార్క్ ఔట్ చేయని ఇందిరమ్మ ఇండ్ల పట్టణ ప్రాంతాలలో 1406, రూరల్ ప్రాంతాల్లో 967 పెండింగ్ ఉన్నాయని, మొత్తం జిల్లాలో 2373 ఇండ్లు పెండింగ్ లో ఉన్నాయని,జనవరి 30 నాటికి ఈ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మార్క్ ఔట్ చేయని పక్షంలో వాటిని రద్దు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని



అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా బేస్మెంట్ వరకు పనులు జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నరేగా క్రింద 90 రోజుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఇందిరమ్మ ఇండ్ల పనులు నరేగా క్రింద నమోదు అయ్యేలా సంబంధిత ఎంపీడీవో, ఇతర మండల అధికారులతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ముగ్గులు పోసుకుంటే ఫిబ్రవరి నెలలో కనీసం 400 ఇండ్లు బేస్మెంట్ స్థాయికి చేరుతాయని, జనవరి 30 వరకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ జరిగేలా చూడాలని అన్నారు. రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మండలంలో వివిధ స్టేజీ లలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు మార్చి నాటికీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండ్ల నిర్మాణానికి నిధులు లేని పక్షంలో మహిళా సంఘాల ద్వారా స్వయం సహాయక రుణాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మినీ మేడారంగా సమ్మక్క సారలమ్మ జాతర
- గోదావరిఖని జాతర స్థలాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గోదావరిఖని, జనవరి- 23 (ప్రభాత జాగృతి):**

సమ్మక్క సారలమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ తో కలిసి గోదావరిఖని సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,* జనవరి 28 నుంచి 31 వరకు నిర్వహించే సమక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లను చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని, 8 నుంచి 10 లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ దాదాపు 7 నుంచి 8 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేసిందని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా మరో 2 కోట్ల రూపాయలను జాతర కోసం ఖర్చు చేశామని అన్నారు. భక్తుల వాహనాలకు సంబంధించిన పార్కింగ్ నుంచి మళ్లీ తిరిగి వెళ్లే వరకు అవసరమైన ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా చేశామని అన్నారు. జాతర నిర్వహణకు సంబంధించి సింగరేణి, ఎన్టిపిసి , మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతరను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించే అదనపు కార్మికులను ఏర్పాటు చేశామని అన్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసే వారికి అవసరమైన షవర్స్, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



**వేములవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బదిలీ పై వచ్చిన కే. సంపత్ కుమార్ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.**

**- ప్రభాత జాగృతి, వేములవాడ**

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



**రామగిరి జనవరి 23 (ప్రభాత జాగృతి):** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం అయినటువంటి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ప్రతినిధులతో శుక్రవారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి యం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా ఓసిపి2 ఎక్స్టెన్షన్ ప్రాజెక్ట్ లో ప్రాజెక్ట్ ఆఫీస్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఆఫీస్, మేనేజర్ ఆఫీస్, విశ్రాంతి గది ఒకేచోట నిర్మించడం, ఓసిపి2 ఎక్స్టెన్షన్ ప్రాజెక్ట్ కు నూతన గ్రేడర్లను కొనుగోలు చేయడం, ఆర్.జి.త్రీ, ఏ.పి.ఏ ఏరియాలలో స్క్రాప్ యార్డు లను ఏర్పాటు చేసి త్వరితగతిన టెండర్లు పిలిచి స్క్రాప్ ను డిస్పోజల్ చేయడం, ఓసిపి 1 సైట్ ఆఫీస్ నుండి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు గల రోడ్ ను మరమ్మత్తు చేయడం, ఓసిపి 1 సైలో నుండి ప్రాజెక్ట్ ఆఫీస్ వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేయడం, ఉపరితల గనులలో ఓవర్మెన్, ఫోర్ మెన్, క్యాటగిరి టెక్నీషియన్ ఖాళీలను భర్తీ చేయడం, సి2, టి2 క్వార్టర్ల వెనకాల గల మురుగు కాలువలు పునర్నిర్మాణం చేయడం, సెంటినరీ కాలనీలోని జోన్ 1, 2, 3 లలో పార్కు లను ఏర్పాటు చేయడం, ఆర్.జి3, ఎపిఎ ఏరియాల లోని అన్ని విభాగాలలో పర్సనల్ ఫైల్స్, రికార్డులు భద్రపరచడం కోసం లాకర్లను ఏర్పాటు చేయడం, సెంటినరీ కాలనీ తెలంగాణ చౌరస్తా నందు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం, లాంటి పది అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జి.యం.లు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రాంచందర్, డి.తిరుపతి రావు, విజయ రాఘవ, ఏరియా ఇంజనీర్ వి.వి. సుధాకర్ రెడ్డి, ఎస్వోటుజిఎంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫాంటింగ్, జె.రాజశేఖర్, ఐఇడి డిజియం బి.టి.మురళీ కృష్ణ, సివిల్ డిజియం బి.రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు రవిచరణ్, సునీల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్రం కోసం హింస మార్గంను ఎన్నుకున్న నేతాజీ సుభాష్

**సికింద్రాబాద్: జనవరి 23: ప్రభాత జాగృతి ప్రతినిధి :** దేశ స్వతంత్రం కోసం పోరాటం చేసేందుకు యావత్ ప్రపంచాన్ని ఏకం చేసిన మహా యోధుడు నేతాజీ సుభాష్ అని మాజీ గవర్నర్ దత్తాత్రేయ కొనియాడారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకుడు కొంతం నరేష్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత నేతాజీ ఆదర్శాలను అనుసరించి దేశ సేవలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. యువ రక్తం తమకు అందిస్తే దేశానికి స్వాతంత్రం విడుదల ఇస్తాయని శబదం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఆయన చేసిన గొప్ప పనులను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డులో నేతల మధ్య ముదురుతున్న మాటల యుద్ధం

- కంటోన్మెంట్ బోర్డులో చిన్న పిల్లల ఆటలను కట్టడి చేయాలి
- అల్ప సంతోషం ఎందుకు? పెద్ద పనులు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్

**కంటోన్మెంట్ : జనవరి 23: ప్రభాత జాగృతి ప్రతినిధి:** కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మాటల పెరిగింది. బోర్డు నామినేటెడ్ సభ్యురాలు, ఎమ్మెల్యే,సీఈఓ ల మధ్య మాటల యుద్ధం సాగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న టాక్స్ పెంపుపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమావేశం లో లేవనెత్తారు.బిల్డింగ్ అనుమతులకు పై చర్చ సాగిందన్నారు. అనుమతులకు మించి భవన నిర్మాణాలు నిర్మిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అటువంటి వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయబోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బోర్డ్ అధికారులు కోరారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏమి చేయలేమన్నారు. బోర్డు లో టౌన్ ప్లానింగ్ చూసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టు ఉద్యోగాలు స్థానికులకే**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్న పోస్టులలో స్థానికులకే మెజార్టీ స్థానం ఇవ్వాలని ఆయన తెలిపారు. కంటోన్మెంటులో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య రోజుకి తగ్గిపోతున్న నేపథ్యంలో స్థానికులకు ఉపాధి కల్పిస్తే బోర్డుకు వారి కుటుంబాలకు కాస్త ఊరట లభిస్తుందని స్పష్టం చేశారు. ఇదే విషయంపై బోర్డు సీఈవో అధికారులు చొరవ తీసుకోవాల న్నారు.ఇక బోర్డు విలీనం కోసం బ్రిగేడియర్ తో మాట్లాడగా.. త్వరగా చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఇది విషయమై కేంద్రంలో



రక్షణ శాఖ అధికారులు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. బోర్డు పరిధిలో అభివృద్ధి జరగాలంటే విలీనమే ఏకైక మార్గము మందని వెల్లడించారు.

**పెరుగనున్న పన్ను- ప్రభావం తప్పదనే ఎమ్మెల్యే**

ప్రాపర్టీ టాక్స్ పెంచడంతో పేద ప్రజల పై తీవ్ర ప్రభావం చూపుతుందని సమావేశంలో లేవనేత్తారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన టీపీటీ అడిగారు కానీ సర్వీస్ చర్చ్ పై క్లారిటీ ఎందుకు ఇవ్వడం లేదని నామినేటెడ్ సభ్యురాలును నిలదీశారు. మరో వైపు బోర్డు పరిధిలో ఒక పని తీసుకురాలేదని,పని చేయలేదని మండిపడ్డారు.బోర్డు ఖాతాలో జామ చేసిన 303 కోట్ల రూపాయలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులని స్పష్టంచేశారు.ఎలి వెటర్ కారిదార్ కోసం మరో రెండు ఎకరా భూమి తీసుకున్నట్లు తెలిపారు. అందు కోసం బోర్డుకు మరో13 కోట్ల రూపాయలు వస్తాయని వివరించారు.

**బోర్డు వద్ద పంచయితీ ఎందుకు? చిన్న పిల్లల ఆటలా?**

కంటోన్మెంట్ బోర్డు చిన్నపిల్లల ఆటలకు వేదికగా మార్చొద్దని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ హెచ్చరించాడు. బోర్డు వద్ద పంచాయితీలు ఎందుకని సూటిగా ప్రశ్నించారు. బోర్డు వద్ద ఎవరైనా ధర్నాలు దిష్టిబొమ్మలు దగ్ధం చేసిన కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ పార్టీ నేతలు బోర్డు ముందు చేసిన నినాదాలు పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఇదిలా ఉంటే గతంలో టిఆర్ఎస్ నాయకుడు చేసిన నామినేటెడ్ సభ్యురాలి కుర్చీ దగ్ధంపై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తాజాగా మరో పార్టీ నాయకులు నినాదాలు చేయడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేస్తారా? లేదా?అన్నది త్వరలోనే తేలనుంది.

**చిన్న పనులకు అల్పసంతోషామా?**

జూబ్లీ బస్టాండ్ పరిసర ప్రాంతంలో కూల్చివేసిన షాపుల నిర్వహకులకు ఊరట లభించింది. కేంద్ర ఎస్టీ కార్పొరేషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు తిరిగి ఆ షాపుల యజమానులకు అవకాశం కల్పించే లాగున ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విషయంపై బిజెపి నాయకులు అల్ప సంతోషం వ్యక్తం చేయడం విచారకరమ న్నారు. చిన్న పనులు చేసి అల్ప సంతోషం లో ఉన్నారని ఆయన మండిపడ్డారు. పెద్ద పెద్ద పనులు చేసి సంతోషం వ్యక్తం చేసే బాగుంటుందని విమర్శించారు. పైగా సర్వం కోల్పోయిన బాధితులకు న్యాయం చేయడంతో వారి కల నెరవేరిందని ఆయన వెల్లడించారు. షాప్ నిర్వాహనకు ఓ కమిటీని వేసి వారికి ఆయా షాపులను కేటాయించాలని తెలిపారు. సుమారు 41 మంది ఎస్టీలకు తిరిగి షాపులు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. మిగతా వారికి ఇదే అవకాశాన్ని కల్పిస్తారా లేదా అన్నది భవిష్యత్తులో తేలనుంది.

**కంటోన్మెంట్ సర్వరోగ నివారణ విలీనం-ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభించాలంటే విలీనమే సర్వరోగ నివారణని ఆయన స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని నాటకాలు ఆడిన ప్రజలు వారికి బుద్ధి చెప్తారని జోష్యం చెప్పారు. కోర్టుకు ఎన్నికలు నిర్వహించడం లో వైఫల్యం చెందిన రక్షణ శాఖ కేంద్రం విలీనంపై దృష్టి పెట్టి త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ఎన్నికలే ప్రధాన నిర్వహణ అని ఆయన గుర్తు చేశారు. ఇక ఎన్నికలు నిర్వహించ నిర్వహించకుండా విలీనం చేయకుండా నాటకాలు ఆడుతూ నామినేటెడ్ పోస్ట్ తో నెట్టుకు వస్తున్న వారికి ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెప్పుతారని పేర్కొన్నారు.

# యూపీపై గుజరాత్ ఘన విజయం





మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 45 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 154 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన యూపీ 17.3 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌట్ అయింది. లిచ్‌ఫీల్డ్ (32 పరుగులు), ట్రయాన్ (30? పరుగులు) రన్స్ చేశారు. గుజరాత్ బౌలర్లలో రాజేశ్వరీ గైక్వాడ్ 3 వికెట్లు, రేణుకా సింగ్, సోఫీ డివైన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కష్వీ గౌతమ్, ఆష్లీ గార్డ్‌నర్ చెరో వికెట్ తీశారు. దీంతో ఈ సీజన్?లో గుజరాత్ మూడో విజయం నమోదు చేసింది. 154 పరుగుల ఓ మోస్తారు లక్ష్యంతోనే యూపీ వారియర్స్ ఛేదనకు దిగింది. మెగ్?లానింగ్, కిరణ్ నవ్‌గిరె, హర్లీన్, లిఛ్?ఫీల్డ్? ఉండడంతో ఈ లక్ష్యం యూపీకి కష్టమేమీ కాదని అనుకున్నారంతా. కానీ గుజరాత్ బౌలర్లు బంతితో అదరగొట్టారు. ఛేజింగ్?లో యూపీ జట్టు తడబడింది. ఆరంభంలోనే వికెట్లు కోల్పోయింది. దీంతో ఒత్తిడికి గురైంది. తొలి ఓవర్లోనే కిరణ్ నవ్‌గిరె (0) డకౌట్ అయ్యింది. తర్వాత భారీ అంచనాలున్న కెప్టెన్ మెగ్ లానింగ్ (14 పరుగులు) స్వల్ప స్కోర్?కే వెనుదిరిగింది. లానింగ్‌ను కష్వీ ఔట్ చేసింది. దీంతో 5 ఓవర్లకు యూపీ స్కోర్ 39/2. లిచ్‌ఫీల్డ్ అప్పుడప్పుడు బౌండరీలు కొట్టి సాధించాల్సిన రన్‌రేట్ మరీ పెరగకుండా చూసింది. కానీ లిచ్‌ఫీల్డ్‌ను ఆష్లీ గార్డ్‌నర్ ఎనిమిదో ఓవర్లో ఔట్ చేసి ప్రత్యర్థిని గట్టి దెబ్బ తీసింది. ఆ తర్వాత హర్లీన్ డియోల్ (3 పరుగులు), దీప్తి శర్మ (4 పరుగులు) సైతం వెనుదిరగడంతో యూపీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఆ జట్టు 11 ఓవర్లకు 68-5తో ఓటమి దిశగా సాగింది. చివర్లో ట్రయాన్ కొన్ని షాట్లు ఆడినా మరోవైపు ఆమెకు సహకారం లేదు. ఇక 48 బంతుల్లో 75 పరుగులు కావాల్సిన దశలో ట్రయాన్ పోరాటం పరుగుల అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లకు 153 పరుగులు చేసింది. అయితే గుజరాత్?కు దక్కిన ఆరంభం చూస్తే, జట్టు తక్కువ స్కోర్ చేసినట్లే! గుజరాత్ 2 ఓవర్లకు 20, 5 ఓవర్లకు 43- 2 ఆరంభంలో గుజరాత్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. తొలుత దూకుడుగా ఆడిన ఆ జట్టు, తర్వాత వికెట్లు కోల్పోయింది. దీంతో ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. బెత్ మూనీ (38 పరుగులు) ఆకట్టుకోగా, సోఫీ డివైన్ (50 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించింది. మిగిలిన బ్యాటర్లు డానీ వ్యాట్ (14 పరుగులు), అనుష్క శర్మ (14 పరుగులు), అష్లీ గార్డ్‌నర్ (5 పరుగులు), భార్తి (5 పరుగులు), కనిక అహూజా (6 పరుగులు), రేణుకా సింగ్ ఠాకూర్ (1 పరుగులు) విఫలమయ్యారు. చివర్లో కాశ్వీ గౌతమ్ (11 పరుగులు, 6 బంతుల్లో) ఫర్వాలేదనిపించింది. అయితే యూపీ బౌలర్లకు ఎదుర్కొని సోఫీ క్రీజులో నిలబడడంతో గుజరాత్ స్కోర్ 150 దాటింది. యూపీ బౌలర్లలో క్రాంతి గౌడ్, సోఫీ ఎక్సల్?స్టోన్ చెరో 2, దీప్తి శర్మ, చోలో ట్రయాన్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, హ్యాట్రిక్ పరాజయాల తర్వాత గుజరాత్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. యూపీకి రెండు విజయాల తర్వాత ఇదే తొలి ఓటమి. ఈ విజయంతో గుజరాత్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి (6 పాయింట్లు) దూసుకెళ్లింది.





# బంగ్లాదేశ్ విషయంలో జై షా సంప్రదింపులు

2026 పురుషుల టీ20 ప్రపంచ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో పర్యటించకుంటే అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్ జై షా కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నారని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ
అంశంపై తుది నిర్ణయం తీసుకునే విషయంపై ఐసీసీ చైర్మన్ దుబాయ్ వేదికగా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించాయి. బంగ్లాలో హిందువులపై నేరాలు పెరిగిన వేళ బీసీసీఐ సూచనతో ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్?ను ఐపీఎల్ 2026 జట్టు నుంచి కేకేఆర్ తొలగించింది. అప్పటినుంచి భారత్?పై బీసీబీ అక్కసు పెంచుకుంది. తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయనీ టీ20 ప్రపంచకప్ మ్యాచ్?లను భారత్ వెలుపల శ్రీలంకలో నిర్వహించాలని కోరగా ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. భారత్?లో బంగ్లా జట్టు, మ్యాచ్ వేదికలకు బీసీబీ చెప్పినట్లు ఎలాంటి ముప్పు గుర్తించలేదని ఐసీసీ పేర్కొంది. ఐసిసి విజ్ఞప్తిని తిరస్కరించిన తర్వాత స్పందించిన బీసిబీ చీఫ్ అమినుల్ ఇస్లాం భారత్?లో ఆడలేమని మరోసారి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చీఫ్ జైషా నిర్ణయం ఏ నిర్ణయం తీసుకుంటారోన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

# బుమ్రా గాయంపై ఊహాగానాలు!?

భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లోని రెండో మ్యాచ్ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతోంది. ఈ మ్యాచ్ కోసం భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో జస్ప్రీత్ బుమ్రాను తొలగించారు. అతని స్థానంలో హర్షిత్ రాణాకు అవకాశం ఇచ్చారు. బుమ్రాను తప్పించడంతో, 2026 టీ20 ప్రపంచ కప్‌కు ముందు భారత దిగ్గజ ఫాస్ట్ బౌలర్ గాయపడ్డాడా అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. గత బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన సిరీస్‌లోని మొదటి టీ20 లో బుమ్రా భారత ప్లేయింగ్ చీఎలో భాగమవడం గమనించదగ్గ విషయం. అయితే, ఆ మ్యాచ్‌లో అతనికి వికెట్ దక్కలేదు. అతను తన పూర్తి నాలుగు ఓవర్లు కూడా బౌలింగ్ చేయలేదు. అతను మూడు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు, ఇది అతని గాయం గురించి ప్రశ్నలను లేవనెత్తింది. రాయ్‌పూర్‌లో టాస్ తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చామని, ప్లేయింగ్ 11లో లేదని ప్రకటించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను పరిగణనలోకి తీసుకుంటే, బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. అతను టీ20 ప్రపంచ కప్‌లో భారతదేశానికి కీలక ఆటగాడిగా ఉంటాడు. హర్షిత్ రాణాతోపాటు, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా ప్లేయింగ్ ఎలెవన్ లోకి తిరిగి వచ్చాడు. మొదటి టీ20లో గాయపడి మైదానం నుంచి నిష్క్రమించిన అక్షర్ పటేల్ స్థానంలో కుల్దీప్ వచ్చాడు. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో టీం ఇండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం గమనించదగ్గ విషయం. మొదట బ్యాటింగ్ చేసిన టీం ఇండియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఇది టీ20ల్లో న్యూజిలాండ్‌పై భారత్ సాధించిన అత్యధిక స్కోరు. దీనికి ప్రతిస్పందనగా, కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. తద్వారా, మెన్ ఇన్ బ్లూ జట్టు తొలి టీ20ని గెలుచుకుని సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.



# రంజీ ట్రోఫీలో సర్ఫరాజ్ ఖాన్ ఐదో డబుల్ సెంచరీ !



ముంబై స్టార్ బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి భారత దేశీయ క్రికెట్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. స్థిరమైన బ్యాటింగ్‌తో నమ్ముకున్న జట్టు విశ్వాసాన్ని నిలబెట్టాడు. 2025-26 రంజీ ట్రోఫీ ఆరో రౌండ్‌లో హైదరాబాద్‌పై జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంబచరీతో దుమ్మురేపాడు. తన ఆట తీరుతో ముంబైని పటిష్ట స్థితిలో ఉంచాడు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ముంబై జట్టు పేలవమైన ఆరంభాన్ని పొందింది. జట్టు 82 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది, ఒత్తిడి స్పష్టంగా ఉంది. ఆ సమయంలో, సర్ఫరాజ్ ఖాన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అతను మొదట తనను తాను సంయమనంతో ఉంచుకున్నాడు, తరువాత తన సహజ దూకుడు ఆటతో పరుగులు సాధించడం ప్రారంభించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి సర్ఫరాజ్ 142 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రెండో రోజు కూడా అతని బ్యాటింగ్ అదే ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. అతను కేవలం 206 బంతుల్లోనే తన డబుల్ సెంచరీని చేరుకున్నాడు. చివరికి అవుట్ అయ్యే ముందు, సర్ఫరాజ్ 219 బంతుల్లో 19 ఫోర్లు, 9 సిక్సర్లతో సహా 227 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సర్ఫరాజ్ ఔటైన తర్వాతే హైదరాబాద్ బౌలర్లకు కొంత ఊరట లభించింది. ఈ ఇన్నింగ్స్‌తో ముంబై జట్టు 560 పరుగులు చేసింది. హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు ఈ మ్యాచ్ అంతగా మంచిది కాదు. ఈ మ్యాచ్‌లో అతను కేవలం ఒక వికెట్ మాత్రమే తీసుకున్నాడు. దీనితో, సర్ఫరాజ్ ఖాన్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో ఐదు డబుల్ సెంచరీలు సాధించాడు. ఈ గణాంకాలు దేశీయ క్రికెట్‌లో అతని స్టామినాను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత రంజీ సీజన్‌లో కూడా అతను అద్భుతంగా రాణించాడు. అతను ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 400 కంటే ఎక్కువ పరుగులు చేశాడు, ఈ కాలంలో సగటున 55 కంటే ఎక్కువ. ఇది మాత్రమే కాదు, ఈ ఇన్నింగ్స్‌లో, సర్ఫరాజ్ ఖాన్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 5,000 పరుగులు కూడా పూర్తి చేశాడు. 28 ఏళ్ల ఈ ఆటగాడు ఇప్పుడు 61 మ్యాచ్‌ల్లో 91 ఇన్నింగ్స్‌ల్లో 64 కంటే ఎక్కువ సగటుతో 5,090 పరుగులు చేశాడు. అతని పేరు మీద 17 సెంచరీలు, 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. సర్ఫరాజ్ ఖాన్ చివరిసారిగా 2024 నవంబర్‌లో భారత జట్టు తరఫున టెస్ట్ మ్యాచ్ ఆడాడు. అప్పటి నుంచి అతను భారత జట్టులో చోటు దక్కించుకోలేదు. అయితే, విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ, ఇప్పుడు రంజీ ట్రోఫీలో అతను స్థిరంగా పరుగులు సాధించడం మరోసారి సెలెక్టర్లకు బలమైన వాదనగా మారింది.





## అనుకున్న టైమ్‌కే వారణాసి విడుదల

సూపర్‌స్టార్ మహేశ్ బాబు ,దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది.ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం.

భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు 'రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి' అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.

# పవన్ ఉస్తాద్ కోసం చంద్రబోస్ పట్టు

## మేనరిజానికి తగ్గట్లుగా బ్యాక్ గ్రౌండ్ సాంగ్



పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్ర పోషిస్తోంఇ. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ సింగిల్ దేఖ్ లేంగే సాలా నెట్టింటిని షేక్ చేస్తుందని తెలిసిందే. తాజాగా మరో క్రేజీ అప్‌డేట్ అందించారు మేకర్స్. ప్రముఖ లిరిసిస్ట్ చంద్రబోస్ రాసిన బ్యాక్ గ్రౌండ్ సాంగ్ రెడీ అయింది. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ సెన్సేషనల్ లిరిక్స్‌తో పవన్ స్టార్ మేనరిజాన్ని మరోసారి చూపించబోతుంది. వేచి ఉండండి.. అంటూ చంద్రబోస్ రిలిక్స్ సిద్ధం చేస్తున్న స్టిల్‌ను షేర్ చేశారు. ఇప్పుడీ స్టిల్ నెట్టింట వైరల్ అవుతూ మరో బ్లాక్ బస్టర్ సాంగ్ రెడీ అవుతుందని చెప్పకనే చెబుతోంది. దేవీ శ్రీ ప్రసాద్ కంపోజిషన్‌లో విశాల్ దడ్‌లానీ పాడిన రంపంపం రంపంపం స్టెప్పేస్తే భూకంపం.. దేఖ్‌లేంగే సాలా సాంగ్ అంటూ లాంగ్ గ్యాప్ తర్వాత పవన్ కల్యాణ్‌లోని స్టైలిష్ డ్యాన్స్‌ను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై చూపించబోతున్నట్టు విజువల్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఇక భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్ తనదైన స్టైల్‌లో డైలాగ్స్ చెబుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఎ÷-లాన్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.


# డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర




టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ముగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి.'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అడివి శేష్ ఎప్పటిలాగే ఈసారి కూడా కొత్త తరహా కథను ఎంచుకున్నాడు. 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. శేష్ లుక్, ప్రెజెంటేషన్ అన్నీ కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, కమలక్ష్మి భాస్కర్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది.




# సోషల్ మీడియా విమర్శలకు దూరం

## దురంధర్ మూవీపై సారా అర్జున్




ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్' విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ , సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్దాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పుడే మాట్లాడుకున్నారు. నేను ఆ సమయంలో అసలు ఫోన్ చూడలేదు' అని చెప్పారు. 'నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్‌లో మాకు ఫోన్ లేదు. బయటకు వచ్చిన దగ్గర నుంచి వరుస సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే సోషల్ మీడియా అలవాటు కాలేదు. ఏదైనా పోస్ట్ చేయాలనుకున్నప్పుడు చేస్తానంతే. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. విరామ సమయంలో ట్రిప్‌లకు వెళ్తుంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను' అని సారా అర్జున్ చెప్పారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' గతేడాది డిసెంబర్ 5న విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికీ థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,283 కోట్లు వసూలు చేసింది.

